
సిద్దిపేటలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వద్ద పోలింగ్ సామగ్రిని పరిశీలిస్తున్న ఎన్నికల సిబ్బంది

# సర్వం సిద్ధం



## అసెంబ్లీ ఎన్నికల సమరానికి పకడ్బందీ చర్యలు

- నాలుగు నియోజకవర్గాల్లో పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి
- జిల్లాలో ఓటర్ల సంఖ్య 9,48,669
- 1,151 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు
- ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి
- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రశాంత్ జీవన్ పాటిల్

సిద్దిపేట అర్బన్, నవంబర్ 29 : జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల సమరానికి సర్వం సిద్ధమైంది. హుస్నాబాద్, సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గాల పరిధిలో పోలింగ్ కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ మేరకు డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల నుంచి పోలింగ్ సామగ్రిని భారీ భద్రత మధ్య కేంద్రాలకు తరలించారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల పరిధిలో మొత్తం 1,151 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో గజ్వేల్‌లో 321, హుస్నాబాద్‌లో 304, సిద్దిపేటలో 273, దుబ్బాకలో 253 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. జిల్లాలో 9,48,664 మంది ఓటర్లు ఉన్నారు. గురువారం ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పోలింగ్ కొనసాగనుంది. ఎన్నికల నిర్వహణ కోసం 1,151 మంది ప్రిసైడింగ్ అధికారులు, 1,151 మంది అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, 2,302 మంది అదర్ ప్రిసైడింగ్ అధికారులు విధులు నిర్వహించడంతో పాటు, అదనంగా 817 మంది రిజర్వ్ సిబ్బంది అందుబాటులో ఉండనున్నారు. నేడు ఎన్నికల సందర్భంగా ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు, కార్యాలయాలు, కర్మాగారాలు, ఫ్యాక్టరీలు అన్నింటికీ వేతనంతో కూడిన సెలవులు మంజూరు చేశారు.

### జిల్లాలోని ఓటర్ల సంఖ్య

**9,48,669**

జిల్లాలో మొత్తం 9,48,669 మంది ఓటర్లు ఉండగా.. ఇందులో మహిళా ఓటర్లు 4,80,166 మంది ఉన్నారు. పురుష ఓటర్లు 4,68,422 మంది ఉన్నారు. ఇందులో జిల్లాలో హుస్నాబాద్(32) నియోజకవర్గంలో 2,42,182 మంది ఓటర్లుఉండగా.. ఇందులో మహిళలు 1,22,415 మంది, పురుషులు 1,19,763 మంది, ఇతరులు నలుగురు ఉన్నారు. సిద్దిపేట(33) నియోజకవర్గంలో మొత్తం 2,33,733 మంది ఓటర్లు ఉండగా.. మహిళలు 1,18,317 మంది, పురుషులు 1,15,346 మంది, ఇతరులు 70 మంది ఉన్నారు. దుబ్బాక(41) నియోజకవర్గంలో మొత్తం 1,98,100 మంది ఓటర్లు ఉండగా.. మహిళలు 1,01,081 మంది, పురుషులు 97,019 మంది ఉన్నారు. గజ్వేల్(42) నియోజకవర్గంలో మొత్తం 2,74,654 మంది ఉండగా.. ఇందులో మహిళలు 1,38,353 మంది ఉండగా.. పురుషులు 1,36,294 మంది, ఇతరులు ఏడుగురు ఉన్నారు.


సిద్దిపేటలో మాట్లాడుతున్న ఆర్వో, ఎన్నికల అబ్జర్వర్

## అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం..

- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రశాంత్ జీవన్ పాటిల్

జిల్లాలో జరిగే ఎన్నికల పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పోలింగ్ కొనసాగుతుంది. నిర్ణీత సమయంలో పోలింగ్ కేంద్రానికి చేరుకున్న అందరికీ ఓటు వేసే అనుమతి ఇస్తాం. ఓటు భారత రాజ్యాంగం పౌరులకు ఇచ్చిన అతి ముఖ్యమైన హక్కు. ఓటు హక్కు కలిగిన ప్రతి పౌరుడు స్వేచ్ఛగా ఓటు వేయాలి. దేశ పౌరులుగా ఎన్నికల్లో ఓటు హక్కుని వినియోగించుకోవడం మన బాధ్యత. ఎలాంటి ప్రలోభాలకు ఆశపడి ఓటును దుర్వినియోగం చేసుకోరాదు. ప్రశాంతంగా ఓటు వేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. ప్రజలు నిర్భయంగా వారికి నచ్చిన వారికి ఓటు వేయాలి.



స్ట్రాంగ్ రూమ్ నుంచి డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌కు పోలింగ్ సామగ్రిని తీసుకెళ్తున్న సిబ్బంది


డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి పోలింగ్ సామగ్రి తీసుకెళ్తున్న సిబ్బంది

## ఇప్పటి వరకు రూ.2.50 కోట్ల నగదు పట్టివేత

జిల్లాలో ఇప్పటి వరకు అక్రమంగా తరలిస్తున్న రూ.2.5 కోట్ల నగదు పట్టుకున్నట్లు కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ తెలిపారు. రూ.3.7 కోట్ల విలువైన 2.8 లక్షల లీటర్ల మద్యం, 13 కిలోల వెండి, 300 కిలోల గంజాయిని అధికారులు సీజ్ చేశారు. జిల్లాలో ఇప్పటి వరకు ఎంసీసీ ద్వారా ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించినందుకు వివిధ రాజకీయ పార్టీలపై 29 ఎఫ్ఐఆర్ కేసులు నమోదు చేసినట్లు అధికారులు వెల్లడించారు.






డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వద్ద పోలింగ్ సామగ్రిని పరిశీలిస్తున్న ఎన్నికల సిబ్బంది, డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి పోలింగ్ సామగ్రిని తరలించేందుకు సిద్ధంగా ఉన్న బస్సులు


సిద్దిపేటలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి పోలింగ్ సామగ్రి తీసుకెళ్తున్న సిబ్బంది


పోలింగ్ సామగ్రిని పరిశీలిస్తున్న అధికారులు